
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 30 సెప్టెంబరు 2024



పేరుకే డెంటల్ కళాశాల..

కడపలోని డెంటల్ కాలేజీపై తీవ్ర విమర్శలున్నాయి. డెంటల్ కాలేజీ ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగు జిల్లా అనంతపురం వాసులకు ఇదే పెద్ద దిక్కు. అయితే ఇది ఒక కుటుంబ ఆధిపత్యంతో డెంటల్ కాలేజీలో సామాన్యులకు వైద్యసేవలు మృగ్యంగా మారాయంటారు. కళాశాలను ఓ కుటుంబం తన సొంత ఆస్తిలా భావించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతోందనే ఆరోపణలున్నాయి. డెంటల్ కాలేజీ 2008లో ప్రారంభమైంది. నేటికి కూడా సరైన వైద్యసేవలు లేని పరిస్థితి నెలకొంది. ఇక్కడ పనిచేసే అధికారులు ఉన్నతస్థాయిలో పనిచేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే పేరుంది.



దంత వైద్యశాల



కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి

పడకేసిన వైద్యం



సర్వజన ఆసుపత్రి. ఇది ఉమ్మడి కడప జిల్లానే కాదు అటు ప్రకాశం, ఇటు అనంతపురం జిల్లాలోని పేదలకు వైద్యానికి పెద్దదిక్కు. దగ్గినా తుమ్మినా ప్రైవేటు ఆసుపత్రి మెట్లెక్కితే చాలు కనీసం రూ.300 నుంచి రూ.500 ఓపీ ఫీజు చెల్లించాలి. అదే ఇక్కడ అయితే పైసా లేకుండానే ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చు. ఇలా ఎంతో పేరున్న సర్వజన ఆసుపత్రి, డెంటల్ కాలేజీ వైసీపీ బ్యాచ్‌కు విడిది కేంద్రంగా మారిపోయాయి. ఎలాగంటే.. హత్య ఇతరత్రా ఆరోపణల కేసుల్లో సెంట్రల్ జైలుకు రిమాండుకు వచ్చిన ఖైదీలు అనారోగ్యం పేరుతో కడప సర్వజన ఆసుపత్రికి వస్తారు. ట్రీట్‌మెంటు పేరుతో ఇక్కడకు వస్తే ఇంట్లో ఉండేంత ఫీల్‌గుడ్ ఉంటుందనే భావన వైసీపీ నేతల్లో ఉన్నట్లు బాగా చర్చ నడుస్తుంది.

- మంత్రిగారూ.. వైద్య ఆరోగ్యశాఖకు చికిత్స చేయండి
- కడపలో గాడి తప్పిన సర్వజన ఆసుపత్రి
- ఇక్కడ వైసీపీ బ్యాచ్ తిష్ట
- సెంట్రల్ జైల్ రిమాండు ఖైదీలకు ఇదో విడిది కేంద్రం
- చాలామటుకు వైద్యుల్లో జగన్ ఫ్యాన్సే

(కడప-ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పేదలకు వైద్య ప్రసాదినిగా మారిన సర్వజన ఆసుపత్రిలో సేవలు డొల్లగా మారాయంటారు. సర్వజన ఆసుపత్రి, డెంటల్ కాలేజీలు వైసీపీకి పునరావాస కేంద్రాలనే పేరు ఉంది. వారి హయాంలోనే కీలకమైన పోస్టుల్లో నియామకమైనవారు, కిందిస్థాయి ఉద్యోగులను కూడా నియమించుకుంటారంటారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖలో ప్రక్షాళన జరుగుతుందని అందరూ భావించారు. అయితే ఇప్పుడంత సీన్ లేదు. వైసీపీదే హవా నడుస్తోంది. ఎందుకంటే సర్వజన ఆసుపత్రి, డెంటల్ కాలేజీలో ముఖ్యులు కూటమి నేతలతో ఒప్పందం చేసుకుని.. వీళ్ల మావాళ్లే, వారి కోసం ఎలక్షన్స్‌లో కష్టపడ్డాం అంటూ కటింగ్‌లు ఇస్తూ అక్కడ చక్రం తిప్పుతున్నారు. మంత్రి సత్యకుమార్ సోమవారం కడపలోని డెంటల్ కళాశాల, ఆడిటోరియంలో పాల్గొననున్నారు. నగరంలోని సూపర్‌స్పెషాలిటీ సర్వజన ఆసుపత్రి, డెంటల్ కాలేజీకి రానున్నారు. అయితే మంత్రి పర్యటనలో ప్రోటోకాల్ వ్యవహారమే దుమారం రేపుతోంది. సర్వజన ఆసుపత్రి జిల్లాకు సంబంధించింది. ఒక విధంగా ఉమ్మడి జిల్లా ఆస్తి. అయితే మంత్రి సత్యకుమార్ పర్యటన సందర్భంగా ఇన్విటేషన్‌లో సర్వజన ఆసుపత్రి అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘనకు తెరలేపారు. గవర్నమెంటు సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి పేరిట ముద్రించిన ఇన్విటేషన్‌లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ ప్రత్యేక అతిథులుగా ఎమ్మెల్యేలు ఆర్.మాధవీ, చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణరెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పేర్లను ప్రకటించి తరువాత కలెక్టర్ శివశంకర్ పేరు ప్రచురించారు. ఇక అతిథులను డాక్టర్ జీవీ రమాదేవి, సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ సురేఖ, జీఎంజీ ప్రిన్సిపల్, సర్వేశ్వర్ రెడ్డి- సూపరింటెండెంట్ ఆఫ్ ఎస్‌ఎస్‌హెచ్ పేరిట ముద్రించారు. ఈ వైద్యశాల జిల్లా సొత్తు. అంటే జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు అందరినీ పిలవాల్సి ఉంది. అయితే ఇక్కడ వన్‌సైడే.

అంతా ఫేక్

డెంటల్ కాలేజీ ఉమ్మడి జిల్లాకే కాదు సీమ జిల్లాలకే ఒక ఆస్తిలాంటిది. ఇక్కడ వైద్య సేవల కోసం కడపతో పాటు పొరుగు జిల్లా అనంతపురం నుంచి ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడ 9 విభాగాలకు సంబంధించి ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు, సీనియర్లు ఇలా మొత్తం అవసరమైన సిబ్బంది ఉన్నారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని మాదిరిగా ఇక్కడ వైద్యసేవలు అందడం గగనం. కేవలం ఒక ఫ్యామిలీ గుత్తాధిపత్యం కారణంగా సేవలందడంలేదంటారు. రూట్‌కెనాల్ చేయించుకోవాలంటే బయట ప్రభుత్వ ఆసుపత్రుల్లో రూ.3వేల వరకు తీసుకుంటారు. ఇక్కడ అయితే ఉచితంగా చేయవచ్చు. అయితే అధికారులు చేయరనే విమర్శ ఉంది. డమ్మీ ఓపీ క్రియేట్ చేసి ప్రైవేటు ఆసుపత్రులకు ప్రయార్టీ ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. పంటి నొప్పి ఇతరత్రా వాటితో ఎవరైనా సరే డెంటల్ కళశాలకు వస్తే వారిని పరీక్షించకుండానే వారి ఓపీ వచ్చే సంవత్సరం ఫిబ్రవరి, మార్చికి ఇస్తారని చెబుతారు. ఇక్కడ ఓపీ రోజూ వందకు పైగా ఉన్నప్పటికీ ఇంకా ఎక్కువగా ఉన్నట్లు ఫేక్ చేసి పైస్థాయికి పంపిస్తారంటారు. రూట్‌కెనాల్‌కు సంబంధించిన ఫైల్స్ విలువ రూ.6వేలు చేస్తారంటారు. అయితే ఇక్కడ పనిచేసే సిబ్బంది వాటిని బయటికి తీసుకువచ్చి ప్రైవేటు ఆసుపత్రుల్లో అమ్ముకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇక కట్టుడు పళ్ల విభాగం కేవలం ఉందంటే ఉందన్నట్లు అంటారు. చికిత్స లేదంటారు. డెంటల్ కాలేజీలను తమ చేతల్లో పెట్టుకున్న ఫ్యామిలీ కట్టుడు పళ్ల ఇతరత్రా సమస్యలు వస్తే సెవెన్‌రోడ్స్ సర్కిల్‌లో ఓ ఆసుపత్రికి రెఫర్ చేస్తారని ఆరోపణలున్నాయి.

డెంటల్ ఆసుపత్రి, సర్వజన ఆసుపత్రినే కాదు జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ పడకేసిందంటారు. ఇక్కడున్న అధికారులంతా చాలా మంది వైసీపీ బ్యాచే. అప్పుడంతా కాలుమీద కాలు వేసుకుని పనిచేయకుండానే జీతాలు తీసుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా వాళ్లే ఇక్కడ పనిచేస్తున్నారు. ఇక సర్వజన ఆసుపత్రి కూడా గాడి తప్పింది. సరాసరి రోజూ 1600కు పైగా రోగులు వస్తుంటారు.



ఇక్కడ వైద్యుల్లో పర్యవేక్షణ లేదు. గతంలో ఆసుపత్రిపై ఐఏఎస్ అధికారి పర్యవేక్షణ ఉండేది. ఉదయం, సాయంత్రం పూట ఓపీ ఉండేది. అయితే ఇప్పుడు వైద్యులు మధ్యాహ్నామే ఇంటి దారి పట్టి ప్రైవేటు క్లినిక్‌లలో ప్రత్యక్షమవుతున్నారనే విమర్శ ఉంది. ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా తీసుకురావాలన్నప్పటికీ వైద్యుల నిర్లక్ష్యం వల్ల పడకేసిందంటారు.





తాళపత్ర గ్రంథాలను తాకుతున్న కలెక్టర్ శివశంకర్

తెలుగు కోసం పరితపించిన బ్రౌన్

- కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప (కల్చరల్), సెప్టెంబర్ 29: తెలుగు భాషను నేర్చుకొని.. ఎవరు చేయలేని సేవ చేసిన కారణజన్ముడు సీపీ బ్రౌన్ అని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ గ్రంథాలయాన్ని కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. విదేశీయుడు అయినా సీపీ బ్రౌన్ తెలుగు భాషకు ఆకర్షితుడై.. తెలుగు భాషను నేర్చుకుని.. తెలుగు భాషకు ఎనలేని సేవ చేశారని కొనియాడారు. తెలుగు సాహిత్య అభివృద్ధికి విశేష కృషి చేసిన ఆంగ్లేయుడు సీపీ బ్రౌన్ అని అన్నారు. తొలి తెలుగు శబ్ద కోసమును పరిష్కరించి ప్రచురించడం జరిగిందన్నారు. సీపీ బ్రౌన్ డిక్షనరీని ఇప్పటికీ తెలుగులో ప్రామాణికంగా ఉపయోగించడం జరుగుతుందన్నారు. తెలుగు జాతికి సేవ చేసిన నలుగురు ఆంగ్లేయులలో ఒకరిగా సీపీ బ్రౌన్‌ను పరిగణిస్తారని అన్నారు. తొలుత సీపీ బ్రౌన్ గ్రంథాలయంలోని అరుదైన పుస్తకాలను, సంచికలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తాళపత్ర బండాగారాన్ని సందర్శించి సరికొత్త పరిశోధనలను జరపాలని సూచించారు. మొల్ల రామాయణ తాళపత్ర గ్రంథాలను పరిశీలించి ఆశ్చర్యం వ్యక్తం చేసి.. మొల్ల రామాయణ తాళపత్ర గ్రంథాలను తన చేతులతో, కళ్లతో చూడడం అదృష్టంగా భావిస్తున్నట్లు వ్యక్తం చేశారు. ప్రధానంగా సీపీ బ్రౌన్ గ్రంథాలయానికి తిరగి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. ఇందుకు పాఠకులు, శ్రోతలు ముందుకు రావాలని వివరిస్తూ కడప జిల్లా గొప్పదనాన్ని పలు విధాల ప్రశంసించారు. ఎందరో మహానుభావులు పుట్టిన గడ్డ అని కీర్తించారు. సుమతి శతకం ఉద్భవించిన జిల్లా అని అన్నారు. వ్యక్తి గతంగా సుమతి శతకం అంటే తనకెంతో ఇష్టమని అన్నారు. పిల్లల్లో చరిత్ర సంస్కృతి సంప్రదాయాలను తెలిసే విధంగా అలవాటు చేయాలన్నారు. అనంతరం సిపి బ్రౌన్ గ్రంథాలయ సలహాదారులు జానమద్ది విజయభాస్కర్, సీపీ బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణ పనులు జరగని పరిణామం గురించి వివరిస్తూ ఇకపై అయినా జాప్యం లేకుండా నూతన భవనం నిర్మాణం మొదలు పెట్టి ఒక సంవత్సరంలోగా పూర్తి చేయాలని కోరారు. అనంతరం గండికోట గార్జ్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీ బ్రౌన్ గ్రంథాలయ ప్రతినిధులు భూతపురి గోపాలకృష్ణ, చింతకుంట శివారెడ్డి, వైవీయూ రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి, గ్రంథాలయం డైరెక్టర్ పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండల దర్శనం గొప్ప అవకాశం : కలెక్టర్



కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 29: కడప కొంగు సింగారాలను ఒలకబోస్తున్న పాలకొండలు, అక్కడి జలపాత సవ్వడులను, పక్షుల కిలకిల రావాలను అస్వాదించడం కొత్త అనుభూతిని ఇచ్చిందని, ఇది గొప్ప అవకాశంగా భావిస్తున్నానని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. ఆదివారం ఆట విడుపులో భాగంగా కటుంబ సభ్యులతో కలసి ఆయన కడప నగర శివారులోని పాలకొండలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ చుట్టూ పచ్చదనం, పాలకొండల పకృతి రమనీయ దృశ్యాలు, తమకెంతో అహ్లాదాన్ని, ఆనందాన్ని కలిగించాయన్నారు. పాలకొండల జలపాతంలో తడవడంలో చక్కటి ఆడవిడుపులా గడిచిందన్నారు. పర్యాటం వైపు ఆసక్తిని పెంచే సహజమైన అడవులు కడప జిల్లా సొంతమన్నారు. నగరానికి మూడువైపుల నల్లమల అడవుల్లో బాగమైన కొండలు విస్తరించి ఉన్నాయన్నారు. పర్యాటక పిర్రియులను ఆకట్టుకునే ప్రకృతి వనరులు కడప జిల్లాలో కోకొల్లాలుగా ఉన్నాయన్నారు. చూసే మనసుండాలే కానీ చారిత్రాత్మక కట్టడాలు, ప్రకృత్రి రమణీయ దృశ్యాలు, జిల్లాలో ప్రతి రాయి, ప్రతి వాగూ వంక, చెట్టు చేమా అన్నీ కూడా పర్యాటక సొగసులను ఆరబోసేవే అని వ్యాఖ్యానించారు. తిరుమలేశుని తొలి గడపగా ఖ్యాతి గాంచిన కడప జిల్లా ఎన్నో ప్రాశ్యస్తమైన పుణ్య క్షేత్రాలు, పర్యాటక కేంద్రాలు, ప్రకృతి సోయగాల నెలవుగా అలరారుతోందన్నారు. జిల్లాలో అద్భుతమైన చారిత్రక వైభవం, గొప్ప సాంస్కృతిక వారసత్వ సంపద గండికోట కూడా ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు. అందుబాటులో ఉన్న దర్శనీయ ప్రాంతాలను కచ్చితంగా చూడాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.

వంద రోజుల్లోనే.. మన్ననలు

- మంచి ప్రభుత్వం అనిపించుకున్న కూటమి పాలన
- మోదీ పాలనలో భారత్ విశ్వగురువుగా ఆవిర్భవిస్తుంది
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 29: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వంగా ప్రజల మన్ననలు పొందిందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ప్రొద్దుటూరుకు వచ్చిన మంత్రికి బీజేపీ కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. వాసవీ సర్కిల్ నుంచి ఎర్రగుంట్ల బైపాస్‌రోడ్డు, మైదుకూరు రోడ్డు, శివాలయం సెంటర్ మీదుగా టీటీడీ కల్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ధర్మవరం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు రాష్ట్ర మంత్రిగా అవకాశం కల్పించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. లారీ డ్రైవర్ కుమారుడు అయిన తాను బీజేపీ పార్టీలో 25 సంవత్సరాల క్రితం సామాన్య కార్యకర్తగా చేరానని, ఆ పార్టీ సిద్ధాంతాల మేరకు పార్టీ ఆదేశించిన పనిని సమర్థవంతంగా నిర్వహించానన్నారు. నిబద్ధతతో పనిచేయడంతోనే పార్టీలో తనకు తగిన గుర్తింపు, గౌరవం లభించిందన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. కేంద్రంలో మూడుసార్లు ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడం, బీజేపీ గుజరాత్‌లో ఏడుసార్లు, మధ్యప్రదేశ్‌లో అయిదుసార్లు అధికారంలోకి రావడం ఆ పార్టీ పట్ల ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. నిరంకుశ పాలన సాగించిన వైసీపీకి ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం చేసిన ప్రజలు కూటమికి 164 సీట్లు కట్టబెట్టి విశ్వాసాన్ని ప్రదర్శించారన్నారు. కూటమి పాలనలో కొప్పర్తి, శ్రీకాళహస్తిలో పారిశ్రామికేతరణ చేసి ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మంచి పనులను బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు.

కార్యక్రమంలో బీజేపీ మహిళామోర్చ రాష్ట్ర కోశాధికారి సి.వి.విజయలక్ష్మి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎ.హరినారాయణ, రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణయాదవ్, సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డి, కుప్పాల శ్రీనాధరెడ్డి, బీజేవైఎం నాయకుడు బొమ్మన విజయ్, పృధ్వీనారాయణ, బీజేపీ పట్టణాధ్యక్షుడు నరేంద్రరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కొండారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 3,03,819 ఎకరాల్లో ఈ-క్రాప్ బుకింగ్

కడప రూరల్, సెప్టెంబర్ 29: రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రాప్ బుకింగ్, ఈ కెవైసీ నమోదు చేసుకున్న రైతుల జాబితాను జిల్లాల వారీగా ఆదివారం ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలో 303819 ఎకరాలో 112934 మంది రైతులు ఈ క్రాప్ బుకింగ్ నమోదుతో పాటు 300898 ఎకరాలలో 111845 మంది రైతులు ఈకేవైసీ నమోదు చేసుకున్నట్లు పేర్కొంది. వ్యవసాయానికి సంబంధించి ప్రభుత్వ ప్రయోజనాలు లభించాలంటే.. పంట వేసిన ప్రతి ఒక్కరు ఈ-పంట నమోదుతో పాటు, ఈ-కెవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటలను రైతులు సాగుచేశారు. ప్రభుత్వం నిర్ధేశించిన గడువులోపు 303819 ఎకరాలో ఈ-పంట నమోదు చేశారు. ఈ-పంట నమోదుతో రైతులకు పెట్టుబడి రాయితీ, వడ్డీలేని రుణాలు, ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథ కాలు, ప్రయోజనాలు పొందడానికి వీలుపడుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రయోజనాలు ఆశించే రైతులు ఈ-పంట నమోదుతో పాటు, ఈ-కేవైసీని తప్పనిసరిగా చేయించుకోవాల్సి ఉంది. ఈ-పంటలో వివరాలను నమోదు చేసుకోని రైతులకు పై పథకాలు వర్తించవు.

మెడికల్ కాలేజీ సీట్లపై.. మాపై నిందలా?

- కాలేజీ నిర్మించారు.. హాస్టలు నిర్మాణం జరగలేదు
- వైద్యశాఖ మంత్రి సత్యకుమార్

పులివెందుల టౌన్, సెప్టెంబరు 29: పులివెందుల మెడికల్ కాలేజీ సీట్లపై మాపై నిందలు మోపుతున్నారని, వైసీపీ పాలనలో మెడికల్ కాలేజీ నిర్మించారు తప్ప హాస్టలు నిర్మించలేదని.. దీంతో కాలేజీని ప్రారంభించడానికి వీలు కాలేదని ఏపీ వైద్య ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం పులివెందులకు వచ్చిన వైద్యశాఖమంత్రికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం శశిభూషణ్‌రెడ్డి నివాసానికి చేరుకుని అక్కడ మీడియాతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన పాలనలో విప్లవత్మక మార్పులు తీసుకువచ్చామని అంటున్నారని, ఎక్కడ చూసినా ప్రైమరీ హెల్త్ కేర్ కేంద్రాలు అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. సరైన డాక్టర్లు లేరు, నర్సింగ్ సిబ్బంది లేరు, దొడ్డిదారిన అనుమతులు తీసుకువచ్చి మెడికల్ కళాశాలలు నిర్మించారని మంత్రి ఆరోపించారు. రాజమండ్రిలో 95 మంది స్పెషల్ బోధన సిబ్బందికి కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారంటే.. ఏ మాత్రం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఏపీలో వందరోజుల పాలన ఘనంగా పూర్తి చేసుకోవడం.. అందుకు ప్రజలు కూడా దారి పొడవునా చూపుతున్న ఆదరణే నిదర్శనం అన్నారు. కాగా, పులివెందులకు విచ్చేసిన మంత్రి సత్యకుమార్‌ను శాసన మండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పులివెందులలో నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజీ పరిస్థితులను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వివరించారు. మెడికల్ కాలేజీలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు.

లింగాల వైద్యుడిపై చర్యలు తీసుకోండి

లింగాల ప్రాథమిక వైద్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు మంత్రికి ఫిర్యాదు చేశారు. డాక్టర్ కళ్యాణ్ విధులు సక్రమంగా రాడని.. వచ్చిన రోగులకు సరైన వైద్యం చేయడని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ డాక్టరును మార్చేందుకు చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న వైద్యశాఖ మంత్రి సత్యకుమార్



వాలీబాల్ ఆడుతున్న యువకులు

- వందల సంఖ్యలో క్రీడాకారులున్నా.. ప్రోత్సాహం శూన్యం
- ఇదీ బద్వేలు నియోజకవర్గం దుస్థితి

ఆటగాళ్లున్నా.. మైదానం లేదు..!



బద్వేలు కోటవీధిలో సొంతంగా ఏర్పాటు చేసుకున్న క్రికెట్ ప్రాక్టీసు నెట్

బద్వేలు రూరల్, సెప్టెంబరు 29: బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా క్రీడాకారులకు కొదవ లేదు. క్రికెట్, వాలీబాల్, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులు వందల సంఖ్యలో ఉన్నారు. ఇంతమంది క్రీడాకారులు ఉన్నా వారు నైపుణ్యం పెంచుకునేందుకు క్రీడా మైదానం కానీ, ఆడిటోరియం కానీ లేకపోవడం ఆశ్చర్యకరం.

క్రికెట్ క్రీడాకారులకు కొదవే లేదు

నాలుగు దశాబ్దాలుగా బద్వేలులో క్రికెట్ క్రీడాకారులకు కొదవే లేవు. వందల సంఖ్యలో క్రికెట్ క్రీడాకారులు ఉన్నారు. రాయల్ బుల్లెట్స్, తెలుగుగంగ లెవెన్ తదితర టీమ్‌లు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిల్లో జరిగే పోటీలకు వెళ్లి విజేతలుగా వస్తున్నాయి. అయినప్పటికీ వారి నైపుణ్యం పెంచుకునేందుకు క్రీడా మైదానం లేదు. దీంతో బద్వేలు పట్టణంలో ఉన్న క్రికెట్ క్రీడాకారులు ఓ ప్రైవేటు స్థలంలో తామే సొంతంగా నెట్స్ ఏర్పాటు చేసుకుని ప్రాక్టీసు చేస్తున్నారు.

వాలీబాల్‌లో రాష్ట్రస్థాయి ఆటగాళ్లు

వాలీబాల్ క్రీడకు సంబంధించి ఐదు దశాబ్దాలుగా బద్వేలు పట్టణంలో క్రీడాకారులు ఉన్నారు. బాబురావుతో పాటు కొంతమంది ఆటగాళ్లు 1980 దశకంలోనే రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. అప్పటి నుంచి నేటి వరకు ఎంతో మంది వాలీబాల్ క్రీడాకారులు ఉన్నా సరైన ప్రోత్సాహం లేకపోవడంతో వీరి ప్రతిభ వెలుగులోకి రాకుండా పోయింది.

షటిల్ క్రీడలో ప్రతిభావంతులు

షటిల్ క్రీడలో రాణించిన ఆటగాళ్లు బద్వేలు ప్రాంతంలో అనేక మంది ఉన్నారు. రాష్ట్రస్థాయి ఆపై స్థాయికి వెళ్లిన క్రీడాకారులు కూడా బద్వేలులో ఉన్నా వీరికి ఆ సంఘం ఎటువంటి ప్రోత్సాహన్ని అందించలేదు. షటిల్ ఆడాలంటే కడప మున్సిపల్ గ్రౌండ్‌లో ఉన్న ఆడిటోరియం, లేదా ప్రొద్దుటూరులో ఉన్న ఆడిటోరియం మాత్రమే గతి. అంతదూరం వెళ్లి ప్రాక్టీస్ చేయాలంటే ఖర్చుతో కూడుకున్న పని. దీంతో కొంతమంది ఆటగాళ్లు అక్కడక్కడా నెట్స్ వేసుకుని ప్రాక్టీసు చేస్తున్నారు. మిగిలిన వారు ప్రతిభ ఉన్నా ఈ ఆటకు దూరమవుతున్నారు.

క్రీడామైదానానికి స్థలం కేటాయించిన ఆర్డీవో

బద్వేలు రెవెన్యూ డివిజన్ అయిన తరువాత మొట్టమొదటి ఆర్డీవోగా వచ్చిన ఆకుల వెంకటరమణ ఇక్కడి యువతలో క్రీడాసక్తిని గమనించి సిద్దవటం రోడ్డు సబ్‌స్టేషన్ సమీపంలో క్రీడా మైదానానికి ప్రభుత్వస్థలాన్ని కేటాయించారు. అయితే ఆర్డీవో బదిలీపై వెళ్లడంతో క్రీడా మైదానం ఏర్పాటు కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని బద్వేలు నియోజకవర్గంలోని క్రీడాకారులు కోరుతున్నారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలి..



బద్వేలులో సౌత్‌జోన్ యూనివర్శిటీ స్థాయి షటిల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఉన్నారు. వారికి ప్రోత్సాహం అందించాలంటే ప్రభుత్వమే ఓ ఇండోర్‌స్టేడియం ఏర్పాటు చేయాలి. దీంతో క్రీడాకారులు జాతీయ స్థాయిలోకి వెళ్లేందుకు కూడా అవకాశాలు కల్పించినట్లవుతుంది.

- కె.రామయ్య, క్వాలిఫైడ్ షటిల్ కోచ్

ప్రోత్సాహం లేదు..



ఐదు దశాబ్దాలుగా జిల్లాపరిషత్ బాయిస్ హైస్కూలులో వాలీబాల్ ఆడుతున్నారు. 80 వ దశకంలోనే రాష్ట్రస్థాయిలో వాలీబాల్ ఆడి ప్రథమ స్థాయిలో విజేతలై తిరిగి వచ్చిన ఆటగాళ్లు బద్వేలులో ఉన్నారు. ప్రోత్సాహం లేకపోవడంతో అక్కడి వరకే ఆగిపోయారు.

- ఎస్.దేవానందంబాబు, వాలీబాల్ క్రీడాకారుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

సొంతంగా నెట్ ఏర్పాటు..



దాదాపు 20 సంవత్సరాల పైబడి క్రికెట్ ఆడుతున్నాను. రాయల్ బుల్లెట్స్ టీం కెప్టెన్‌గా జిల్లాలో అన్ని ప్రాంతాలకు వెళ్లి మ్యాచ్‌లలో నెగ్గి వస్తున్నాను. క్రికెట్ అసోసియేషన్ ఏ ప్రోత్సాహం అందించకపోవడంతో సొంతంగా నెట్ ఏర్పాటు చేసుకుని ప్రాక్టీస్ చేస్తున్నాం.

- సింగసాని వెంకట-శివకుమార్, రాయల్ బుల్లెట్స్ టీం కెప్టెన్, బద్వేలు


ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్యశాఖా
మాత్యులుగా బాధ్యతలు చేపట్టి
మొదటిసారిగా నేడు కడప నగరంకు
(సాయంత్రం 5.00 గంటలకు
ఎన్‌జిఓ. కాలనీ,
ఈ-సేవ ఎదురుగాగల మా ఇంటికి)
విచ్చేయుచున్న మా ఆత్మీయులు
శ్రీ వై. సత్యకుమార్
గారికి
మా హృదయపూర్వక
స్వాగత సుమాంజలులు...
A.VENKATESWARLU, M.I.E., Chartered Engineer,
Hon'ble Secretary, Institute of Engineers,Kadapa Local Centre.
Chairmen
GURUKUL
VIDYAPEETH
N.G.O. Colony,
Old By-pass Road,
Kadapa.
శ్రీ వై. సత్యకుమార్ గారు
వైద్య, ఆరోగ్య శాఖామాత్యులు
ఆంధ్రప్రదేశ్.
AVR EDUCATIONAL INSTITUTIONS, Andhra Pradesh.
A.V.R. ASSOCIATES, KADAPA.

గ్రీన్ ఫీల్డ్ రోడ్డు పనులను అడ్డుకున్న గ్రామస్థులు



మట్టి తరలింపును అడ్డుకోగా నిలిచిపోయిన టిప్పరు

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 29: మండలంలోని ఇందుకూరు సమీపంలో జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులను గ్రామస్థులు ఆదివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా కొండలను కొల్లగొడుతున్నా అధికారులు నిద్రపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, మట్టి టిప్పర్లను అడ్డుకున్నామన్నారు. కొండను తవ్వితే పశువులకు మేత ఉండదని, వాటిపై జీవనం సాగించే పేద ప్రజలు రోడ్డున పడాల్సి వస్తుందన్నారు. మట్టి తవ్వకాలు ఇలాగే కొనసాగిస్తే కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహారదీక్ష చేస్తామని గ్రామప్రజలు తెలిపారు. మా ఆవేదనను అర్థంచేసుకొని గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు మట్టిని తరలిపోకుండా కాపాడాలని విన్నవించుకుంటున్నారు. అనంతరం రెవెన్యూ అధికారులు మట్టి తరలిస్తున్న ప్రాంతానికి చేరుకొని టిప్పర్లను బయటకు పంపించారు. మట్టి తరలించడానికి ప్రయత్నిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

శ్రీదేవి త్రయ శతక మంజరి పుస్తకావిష్కరణ

కడప (నాగరాజుపేట), సెప్టెంబరు 29 : శ్రీదేవి త్రయ శతక మంజరి పుస్కకావిష్కరణను ఆదివారం పాతకడప హిందూ ధర్మం సమాజ ప్రార్థనా ఆలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ విద్యాతపస్వి మామిళ్ల లోకనాథం శరణాగతితో కవిత్వీకరించిన శారదాంబ, లక్ష్మి, దుర్గ శతకత్రయం ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతుందన్నారు. ఏఎల్ క్రిష్టారెడ్డి పుస్తకావిష్కరణ చేయగా డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి పుస్తక సమీక్ష చేశారు. ధర్మాచార్యులు డాక్టర్ పసుపులేటి శంకర్, బసిరెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ లోకనాథం 50 శతకాలకు పైగా రాయడం అభినందనీయమన్నారు.

పేదల ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్‌కు విరాళం



భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి చెక్కును అందిస్తున్న దృశ్యం

పులివెందుల టౌన్, సెప్టెంబరు 29 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం బడుగు, బలహీనవర్గాలక ఇంద ఉన్న పేద ప్రజల ఆకలి బాధలనుతీర్చడానికి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అన్నక్యాంటిన్ మన పులివెందులలో కూడా ప్రారంభించిన శుభసందర్భంగా అభినందనలు తెలుపుతూ పేద వారి ఆకలి బాధలను తీర్చడానికి మన వంతు సాయంగా మేమున్నామంటూ గుడ్‌మార్నింగ్ ఫ్రెండ్స్ బ్యాచ్ తరపున పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డికి రూ.66116 చెక్కు రూపంలో ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుడ్‌మార్నింగ్ బ్యాచ్ ఫ్రెండ్స్ మునిబాబు, నాగేంద్ర, క్రిష్టారెడ్డి, శంకర్‌నాయక్, పద్మనాభరెడ్డి, రాజారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సురేశ్, కిరణ్, సుధాకర్‌రెడ్డి, బాలక్రిష్ణ, మనోహర్‌రెడ్డి, శ్యాంకుమార్‌రెడ్డి, క్రిష్ణకుమార్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు, జయరాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో బీసీలకు పూర్వవైభవం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాసా కోదండరామ్

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 29: కూటమి పాలనలో బీసీ, చేనేతల అభివృద్ధికి పెద్దపీట వేసిందని, దీంతో బీసీలకు పూర్వవైభవం వచ్చినట్లేనని టీడీపీ పద్మశాలి సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు మాసా కోదండరామ్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలోని టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలు చితికిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి టీడీపీ విజయం సాధించడంతో ఊపిరి పీల్చుకున్నారన్నారు. ప్రతి చేనేత కుటుంబానికి ఆరోగ్య బీమా కింద రూ.2,100 ప్రీమియం చెల్లించేందుకు మన రాష్ట్రంలో గల 1,22,864 చేనేత కుటుంబాలకు రూ.25.76 కోట్లు చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ పద్మశాలి సాధికార సమితి నాయకులు ఎ. వెంకటసుబ్బయ్య, ఎన్.వెంకటయ్య, ఎస్.శ్రీనివాసులు, ఎ.ప్రసాద్, క్రిష్ణమూర్తి, టీడీపీ నాయకులు అయ్యవారయ్య, జె.సుబ్బరాయుడు, కె.వెంకటరమణ, ఎం. బాలయ్య, శ్రీరామదాసు, బి. కన్నయ్య పాల్గొన్నారు.

నాతియా మెహఫిల్‌ను విజయవంతం చేయండి

కడప (కల్చరల్), సెప్టెంబరు 29: కడప నగర ఎన్‌టీఆర్ సర్కిల్ సమీపంలోని గుంతబజార్ వద్ద వచ్చే అక్టోబర్ 1న నిర్వహించనున్న జష్నే ఏ మీలాదున్ నబి నాతియా మేహఫిల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మైనార్టీ నాయకుడు సుభాన్ బాషా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గుంతబజార్ వద్ద నాతియా మెహఫిల్ కార్యక్రమానికి చెందిన ప్రచార రథాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మిలాద్ ఉన్ నబి పర్వదినం సందర్భంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ప్రముఖ గాయకులు షబ్బీర్ బరకతి, నాబీల్, షా షేహజాద్, కవులు పాల్గొని పవిత్ర ఖురాన్ సందేశాన్ని వినిపిస్తారన్నారు. అక్టోబర్ 2న మిలాద్ ఉన్ నబీ అన్నదానం ఉంటుందన్నారు.

పితృదేవతల ఆశీర్వాదాలు అదృష్టకరం

వల్లూరు, సెప్టెంబరు 29: బిడ్డల బాగోగుల కోసం అహర్నిశలు కష్టపడి దారితెన్ను చూపి స్వర్గస్థులైన మాతృ, పితృదేవతల ఆశీర్వాదాలు పొందడం బిడ్డల అదృష్టమని ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ, వారణాశి ప్రసాద్‌శర్మ పేర్కొన్నారు. మహాలయ పక్షముల సందర్భాన్ని పురస్కరించుకుని ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పుష్పగిరి లక్ష్మీ చెన్నకేశవ స్వామివారి సన్నిధిలో గల రుద్రపాదం వద్ద కుల, మతాలకు అతీతంగా ఉచిత సామూహిక తిల తర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సుమారు 300 మందికి పైగా అన్ని వర్గాల ప్రజలు హాజరై వారి వారి పితృదేవతల అనుగ్రహం కోసం ప్రత్యేక పూజా కార్యక్రమాలలో తరించారు.

ఎస్ఎస్ఏ జేఏసీ నూతన కమిటీ ఎన్నిక

కడప (సెవెన్‌రోడ్స్),సెప్టెంబరు 29: కడప జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ఛైర్మన్ ఎం.చంద్రశేఖర్ (పీటీఐ) వైస్ ఛైర్మన్ ఎం. మమత (ఈఐఆర్‌పీ) సి.రాజేశ్ వైస్ ఛైర్మన్ (సీఆర్‌పీ) గంగులప్ప, ప్రధాన కార్యదర్శి (ఐఈఆర్‌పీ) ఎన్.చిన్నయ, జాయింట్ సెక్రటరీ మెసెంజర్ కరుణాకర్ ట్రెజరర్ (ఐఈఆర్ఎఫ్) హుసేన్, సుగుణమ్మ, చంద్రమోహన్, గురుబాబు, కమిటీ సభ్యులు ఎంపికయ్యారు.

ఆందోళనను జయప్రదం చేయండి

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 29: కలెక్టరేట్ వద్ద సోమవారం జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, శ్రీనివాసులరెడ్డి, జిల్లా కోశాధికారి లక్ష్మిదేవి, నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.వెంకటసుబ్బయ్య, పి.చంద్రారెడ్డి ఆదివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఏపీసీఓఎస్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, స్కీమ్‌వర్కర్ల పట్ల రాజకీయ వేధింపులు ఆపాలని ఈ సందర్భంగా కోరారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మహబూబ్ ఆలీ

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 29:కడప నగరంలోని మెడికేర్ హాస్పిటల్‌లో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు డాక్టర్ మహబూబ్ ఆలీ తెలిపారు. ఈ వైద్యశిబిరంలో దాదాపు రూ.3వేల విలువగల షుగరు, కొలెస్ట్రాల్, ఈసీజీ, హెచ్‌బీఎఎల్‌సీ, న్యూ రోపతి పరీక్షలు ఉచితంగా చేశామన్నారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు పాటిస్తూ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలన్నారు. అప్పుడే మధుమేహం, బీపీ తదితర దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు. వైద్యశిబిరంలో సయ్యద్ నూర్, షాహిద్, పఠాన్, గౌతమి, అయేషా, భార్గవి, వైష్ణవి, శిరీషారెడ్డి, సబిహా, మాధవి, మహిత, సువర్ణ పాల్గొన్నారు.

'శ్వేతపత్రం విడుదల చేయాలి'

కడప (ఎర్రముక్కపల్లె), సెప్టెంబరు 29: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో చేసిన అప్పులు ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. పవన్‌కళ్యాణ్ తన ఓనర్ స్క్రిప్ట్ ఇస్తే అప్పుడు బయటికి వచ్చి డ్రామాలు వేస్తాడని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గంగనపల్లె విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెండ్లిమర్రి, సెప్టెంబరు 29: మండలంలోని గంగనపల్లె జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి దేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి తెలిపారు. కడప స్పోర్ట్స్ స్కూల్ నందు జరిగిన పోటీలలో అండర్-17 విభాగంలో హేమర్‌త్రోలో మదన్‌మోహన్‌రెడ్డి, సన్నీ కుమార్‌రాజులు ప్రథమ, ద్వితీయస్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో రవిత్రేణి, రెహానాలు ప్రథమ, ద్వితీయస్థానంలో నిలిచారన్నారు. పోల్వాల్ట్ ఈవెంట్‌లో సుహానా ఫౌజియా, మోసిన ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. వీరు వచ్చేనెలలో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

కమలాపురం రూరల్, సెప్టెంబరు 29: కమలాపురం నగర పంచాయతీలో ఛైర్‌పర్సన్ మార్పురి మేరి అధ్యక్షతన సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర సమావేశం ఉంటుందని నగర కమిషనరు జగన్నాథం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.కావున సమావేశానికి సభ్యులందరూ సకాలంలో హాజరు కావాలన్నారు. ఇన్‌డోర్, అవుట్‌డోర్ మున్సిపల్ సిబ్బంది పాల్గొనాలన్నారు.

మైలవరం దక్షిణ కాల్వకు మరమ్మతులు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 29: మైలవరం నుంచి కమలాపురం చెరువుకు నీరు అందించే దక్షిణ కాల్వకు మరమ్మతులు చేపట్టినట్లు రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చాపాటి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.
ఆదివారం ఆయన మాట్లాడుతూ మైలవరం నుంచి కమలాపురం దక్షిణ కాల్వకు నీరు విడుదల చేశారన్నారు. అయితే ఎర్రగుంట్ల, తిప్పలూరు సమీపంలో రెండు చోట్ల కాల్వ కు గండ్లు పడ్డాయని దాని ద్వారా నీరు వృథాగా పోతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి చొరవతో ఆదివారం కోతకు గురైన చోట మరమ్మతులు చేపట్టామన్నారు. త్వరగా కమలాపురం చెరువుకు నీరు వచ్చే విధంగా ఎమ్మెల్యే సహకారంతో కృషి చేస్తామని ఆయన తెలిపారు.

ప్రతి ఒక్కరూ పరోపకార గుణం కలిగి ఉండాలి



దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న సీఐ

పులివెందుల టౌన్, సెప్టెంబరు 29: ప్రతి ఒక్కరూ పరోపకార గుణం కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ హాజీవలి అన్నారు. ఆదివారం పులివెందుల పట్టణంలోని విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో వేముల మండలం శేషన్నగారిపల్లెకు చెందిన వేముల మాజీ ఉప సర్పంచ్ ఓటికుంట నాయుడు ఏడవ వర్ధంతి సందర్భంగా దివ్యాంగులకు రూ.50వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులను వితరణ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఓటికుంటనాయుడు వేముల మాజీ ఉప సర్పంచ్‌గా పనిచేసి అందరి మన్ననలను పొందారన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిన్నకుమారుడు ఓజియస్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ ఎండీ ఓటికుంట గంగాధర్‌నాయుడు దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేయడం అభినందనీయమని సీఐ పేర్కొన్నారు. వితరణ దాత గంగాధర్‌నాయుడు మాట్లాడు తూ దివ్యాంగుల అభ్యున్నతి కోసం తమ వంతు సహా యం చేస్తామన్నారు. రాష్ట్ర వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, ఓటికుంట కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలి: రూటా



మాట్లాడుతున్న రూటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 29 : రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని సాలే నాగయ్య నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో రూటా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉర్దూ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రూటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇక్బాల్ హాజరై మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నామన్నారు. గౌరవ అతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉర్దూ మీడియం సబ్జెక్టులు, లాంగ్వేజ్, ఎస్‌జీటీ ఉపాధ్యాయుల స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు యదావిధిగాపాత స్కూలు కాంప్లెక్స్ పాఠశాలల్లోనే కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయ సర్దుబాటులో ఉర్దూ పాఠశాలకు బదిలీ చేసిన ఉర్దూ చదవని ఉపాధ్యాయులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డి మాం డ్ చేశారు. రూటా రాష్ట్ర వైర్కింగ్ ఛైర్మన్ హాజీ అబుదల్ హకీమ్‌సాహెబ్ హాజరై మాట్లాడుతూ సీఎంచంద్రబాబునాయుడు 1997లో ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించి ఉర్దూ విద్యావ్యవస్థకు ఊపిరి పోశారన్నారు. 2001 వం దల సంఖ్యలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించారని, అలాంటి మహోన్నత పథకాలు పునఃప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మస్తాన్‌వలి, అఫ్జల్‌బాషా, ముహమ్మద్ ఇర్షాద్, ముహమ్మద్ అయ్యూబ్, బెపారిఫకృద్దీన్, జిల్లా నాయకులు హబీబుల్లా, ముహమ్మద్ దావూద్, అర్షద్ బాషా, ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 29: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ అక్టోబరు 1న మండలానికి రానున్నట్లు ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వేణుగోపాల్, చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ మండలంలోని యు.రాజుపాళెం గ్రామంలో నిర్వహించే సంస్మరణసభకు ఆయన హాజరవుతారన్నారు. 1949 అక్టోబరు 1న కమ్యూనిస్టు పార్టీ నిషేధ కాలంలో కమ్యూనిస్టు నాయకులను పోలీసులు అరెస్టు చేసి జైల్లో ఉంచుతున్న నేపథ్యంలో నాయకుల కోసం గ్రామాల్లో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారన్నారు. ఈ నేపథ్యంలో యు.రాజుపాలెం గ్రామంలో పోలీసులకు, గ్రామస్థులకు మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు దళితకామ్రేడ్‌లు లంపాల చిన్న వెంకటన్న, లంపాల పెద్ద వెంకటన్న, చెప్పలి మారెన్న పోలీసు తూటాలకు ఎదురొడ్డి ప్రాణాలు అర్పించారన్నారు. వీరితో పాటు మరో ముగ్గురు లంపాల వెంకటరామయ్య, వేంపల్లె గంగులు, పాలేటి గంగులు గాయాలతో కొద్ది కాలం తర్వాత మృతిచెందారన్నారు. వీరికి నివాళులర్పించడంలో భాగంగా సంస్మరణ సభ ఏర్పాటుచేశారన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని వారు తెలిపారు.

వర్షం కోసం పూజలు

సీకేదిన్నె, సెప్టెంబరు 29: మండలంలోని బలిజపల్లెలో వర్షం కోసం అంకాళమ్మకు పూజలు నిర్వహించారు. గ్రామస్థులు బోనాలతో ప్రదక్షణలు చేశారు.

దివ్యాంగులకు నిత్యావసరాలు వితరణ

పులివెందుల రూరల్, సెప్టెంబరు 29:పులివెందులలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న దివ్యాంగుల కేంద్రంలో 30 దివ్యాంగులకు నిత్యావసరాలు వితరణగా అందించారు. ఆదివారం వేముల మండలం శేషన్నగారిపల్లెకు చెందిన మాజీసర్పంచు ఓటికుంటనాయుడు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారుడు ఓజీఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ ఓటికుంట గంగాదర్‌నాయుడు దాదాపు రూ.40వేలతో నిత్యావసర సరుకులు సమకూర్చగా ట్రాఫిక్ సీఐ హాజీవలి చేతులమీదుగా 30మందికి అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు తమవంతు సహాయ సహకారాలు అందించిన గంగాధర్‌నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగు నెట్‌వర్క్ నాయకులు రఘునాథరెడ్డి, వెంకటసుబ్బయ్య, సునీల్,కానిస్టేబుల్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

యూసీఐఎల్‌ను సందర్శించిన డిగ్రీ కళాశాల విద్యార్థులు

వేముల, సెప్టెంబరు 29: మండలంలోని ఎం.తుమ్మలపల్లె వద్ద ఉన్న యూసీఐఎల్‌ను కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఆదివారం సందర్శించారు. యూసీఐఎల్ అధికారులు మాట్లాడుతూ డిపార్ట్ మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సాంకేతిక అభివృద్ధిని ప్రదర్శించడం జరిగిందన్నారు. దేశం కోసం స్వచ్ఛమైన ఇందనం ఉత్పత్తికి అంకితం చేయడిందన్నారు. ఆల్కలీన్ లీచింగ్ ప్రాసెసింగ్, అధునాతన మైనింగ్ పద్ధతుల ద్వారా యురేనియం యొక్క మైనింగ్ మరియు ఖనిజధాతువు ప్రాసెసింగ్‌కు బాధ్యత వహిస్తుందన్నారు. ప్రస్తుతం డీఈఏ స్థాపించి 70ఏళ్లు పూర్తైన సందర్భంగా ప్లాటినం జూబ్లీ సంవత్సరాన్ని జరుపుకొంటోందన్నారు. యూసీఐఎల్ అధికారులు సుమన్ సర్కార్, కిషోర్ భగత్ తదితర అధికారులతో పాటు డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి'



మాట్లాడుతున్న సీవీ ప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), సెప్టెంబరు 29 : విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్ అన్నారు. ఆదివారం ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో మెస్, కాస్మటిక్ చార్జీలు పెంచాలని, గత తొమ్మిది నెలల నుంచి ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏపీటీఎఫ్ అమరావతి - అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి, కడప జిల్లా కోశాధికారి ఉమాకాంత్ సాయి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల మేధస్సును పెంచే విధంగా ల్యాబ్ సౌకర్యాన్ని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు గౌస్, సుధీర్, విద్యార్థులు, ఏపీటీఎఫ్ అమరావతి కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులలో శాస్త్రీయ అవగాహన పెంపొందించడమే లక్ష్యం

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 29: విద్యార్థులలో శాస్త్రీయ అవగాహన పెంపొందచడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని జేవీవీ మండల నాయకులు బేరి మోహన్ అన్నారు. ఇందులో భాగంగా అక్టోబరు 1వ తేదీన నిర్వహించబోయే మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను మండలంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు.

అక్టోబరు 1 నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

కడప (ఎర్రముక్కపల్లె), సెప్టెంబరు 29: స్థానిక పటేల్ రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటరులో 30 రోజులపాటు నిర్వహించే యోగా శిక్షణ కొత్త బ్యాచ్‌ను అక్టోబరు 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణుడు డాక్టర్ కల్పన, డాక్టర్ ఆర్.రంగనాధరెడ్డి తెలిపారు. ఈ శిక్షణలో రోగనిరోధకశక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బీపీ, డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామన్నారు. వివరాలకు 9848861206 ఫోన్ చేయాలన్నారు.

చెస్ టోర్నమెంట్ విజేతగా మాస్టర్ రూపేష్‌రెడ్డి

కడప (స్పోర్ట్స్), సెప్టెంబరు 29: జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి సారథ్యంలో ఆదివారం స్థానిక విజ్‌డమ్ స్కూల్‌లో నిర్వహించిన స్టేట్ ఓపెన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నమెంట్‌లో విజేతగా కడప నగరానికి చెందిన మాస్టర్ రూపేష్‌రెడ్డి విజేతగా నిలిచారు. ద్వితీయ విజేతగా గిద్దలూరుకు చెందిన ఎన్ ప్రసాద్, తృతీయ విజేతగా మదనపల్లికి చెందిన విక్రమ్ తేజ నిలిచారు. వీరికి వరుసగా 6,000, 5,000, 4,000, నగదుతో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో కోచ్ తబస్సుమ్, చీఫ్ ఆర్బిటర్ గోపీనాథ్, ఫీడై ఆర్బిటర్ రామ్, సీనియర్ నేషనల్ ఆర్బిటర్లు వంశీ, జిల్లా ఆర్బిటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 29: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చలు నిర్వహించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్జీవో హోంలో ఎస్టీయూ ప్రొద్దుటూరు రీజియన్ వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇంతవరకు చర్చలు జరుపలేదని, ఎప్పుడు చర్చలు జరుపుతుందో ప్రకటించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి మంత్రి లోకేశ్ పాటుపడుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ కన్వీనర్ సలీం, జిల్లా అధ్యక్షుడు ఇలాయాస్‌బాష, సంగమేశ్వరరెడ్డి, రామమోహన్, సురేష్ బాబు, రమణారెడ్డి, రషీద్‌ఖాన్, బాలగంగిరెడ్డి, కొత్తపల్లె శ్రీను, సంజీవరెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలు చోరీ

కొండాపురం, సెప్టెంబరు 29: బెడుదూరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు ఉత్సవ విగ్రహాలు చోరీకి గురైనట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆలయంలోని భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి పంచలోహ విగ్రహాలు చోరీకి గురయ్యాయన్నారు. ఆదివారం తెల్లవారుజామున గుడి తలుపులు పగలగొట్టి విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరి చేశారన్నారు. కడప నుంచి వచ్చిన జాగిలాలు, క్లూస్‌టీమ్ సహాయంతో అనుమానిత ప్రదేశాల్లో శోధించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



అధ్వానం... పారిశుధ్యం

మైదుకూరు రూరల్ ,సెప్టెంబరు 29 : విషజ్వరాలు విజృంభిస్తున్నా, పట్టించుకొనే నాథుడే కరువైయ్యారని ప్రజలు వాపోతున్నారు. మైదుకూరు మున్సిపాలిటీ,మండలంలో విషజ్వరాలతో ప్రజలు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించు కోవడం లేదని ప్రజలు తెలపుతున్నారు. మున్సిపాలిటీ పారిశుధ్య చర్యలు మున్సిపాలిటీ అధికారులు పూర్తిగా వదిలేశారనిపిస్తోంది.రోడ్లపై ఎక్కడిపడితే అక్కడ చెత్త చెదారాలతో కంపుకొడుతున్నాయి, కుక్కలు, పందుల స్వైరవిహారం చేస్తూ దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.బ్లీచింగ్ పౌడర్ చల్లడం,దోమలను అరికట్టడానికి ఫాగింగ్ మిషన్‌తో పొగ కొట్టడం లాంటివి పూర్తిగా మరిచారు. రోగాలతో ప్రజలు గుల్లఅవుతున్నా వైద్య సిబ్బంది కూడా పత్తా లేకుండా పోయారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రవర్తిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి అధికారులు వెంటనే పారిశుధ్య చర్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


చెత్తకుండీల వద్ద పందులు,కుక్కల విహారం

విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 29: విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని మానవత ఎర్రగుంట్ల ఛైర్మన్ డి.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. ఎర్రగుంట్లలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎర్రగుంట్ల డిప్యూటీ తహసీల్దార్ బి.తేజశ్విని ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ రామాంజనేయరెడ్డి, కార్యదర్శి జి.రంగయ్య, మల్లికార్జునరెడ్డి, సతీష్, రాజవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్డులు అందజేత

కొండాపురం, సెప్టెంబు 29: మండలంలోని భవన నిర్మాణ కార్మికులకు ఆదివారం లేబర్ కార్డులను అందజేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజనేయులు, కూటమి నాయకుడు చామల విష్ణువర్ధన్‌రెడ్డి కార్మికులకు లేబర్‌కార్డులను అందజేశారు. ఏఐటీయూసీ,సీపీఐ మండల ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, మనోహర్‌బాబు, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు హనుమంతరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

బద్వేలు, సెప్టెంబర్ 29: రాష్ట్రంలో ఉన్న 3లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ సోమవారం ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు చిన్ని, పట్టణ కన్వీనర్ కొండయ్య, బిల్డింగ్ వర్కర్ నాయకుడు రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉట్టినాగశయన

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 29 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడుగా ఉట్టి నాగశయన ఎన్నికయ్యారు. ఆమేరకు ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ జనరల్ బాడీ సమావేశంలో నాగశయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలి పారు. అధ్యక్షుడిగా బాధ్యతలు పెరిగాయని తన మీద నమ్మకం తో కార్యవర్గం ఇచ్చిన అధ్యక్ష బాధ్యతకు న్యాయం చేస్తానని నాగశయన తెలిపారు.



సీమ అభివృద్ధికి నిధులు సాధించాలి

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 29: కూటమి ముఖ్య మంత్రి చంద్రబాబు రాజధాని అమరావతి కోసమే కాకుండా రాయలసీమ అభివృద్ధికి కూడా కేంద్రంతో పోరాడి నిధులు సాధించి సీమకు బాసటగా నిలబడాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్య క్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ హైస్కూలులోని మహిళా శక్తి భవన్‌లో ఆదివారం రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర మహా సభలు విజయవంతంగా ముగిశాయి. రాయలసీమ అభివృద్ధి కోసం రాజకీయాలు పక్కన పెట్టి ఇక్కడి ఎమ్మెల్యేలు, ఎంపీలు సీమ ఉద్యమాన్ని బలపరచాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం నేత రామాంజనేయులు , డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, వేదిక రాష్ట్ర కోకన్వీనర్ భాస్కర్‌రెడ్డి, అనంతపురం కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, కర్నూలు కన్వీనర్ రత్నం ఏసోపు, కడప కన్వీనర్ మహమూద్, పాణి, వరలక్ష్మి, పద్మ, లక్ష్మీదేవి, పల్లవోలు రమణ, శ్రీనివాసులరెడ్డి, హరిత, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పాల్గొన్నారు. అనంతపురం ర్యాలీ శివాలయం సర్కిల్ వరకు చేపట్టారు.

ప్రొద్దుటూరు అంటే ఎనలేని భావోద్వేగం

రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రొద్దుటూరు ,సెప్టెంబరు 29 : ప్రొద్దుటూరు అంటే నాకు ఎనలేని భావోద్వేగం కలుగుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆదివారం స్థానిక రాయల్ కౌంటీలో మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో ఆయన మిత్రబృందం, పట్టణంలోని ప్రముఖులు మధ్య ఆత్మీయ సమావేశం అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ ప్రొద్దుటూరుకు మొట్ట మొదటి మంత్రిగా తనకు అవకాశం దక్కడం ఎంతో అదృష్టమన్నారు. తన వూరు బాల్య మిత్రులు మధ్య తనకు ఇలాంటి అరుదైన అభినందన ఈ ప్రొద్దుటూరు వాసిగా దక్కడం ఎన్నటికీ మరిచిపోలేనన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ సత్యకుమార్ ఎంతో వినయ విధేయతలున్న మేధావి అన్నారు. అనంతరం పెద్ద ఎత్తున అనేక వర్గాల వారు సత్యకుమార్ యాదవ్‌కు సన్మానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రావు, సాయి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అంకాల్ కొండయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


సత్యకుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ముద్దనూరులో మంత్రికి ఘన స్వాగతం

ముద్దనూరు, సెప్టెంబరు 29: ముద్దనూరులో ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌కు ఆదివారం మండల బీజేపీ నాయకులు మధుసూదన్‌నరెడ్డి, గుణవంతురెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం పలికారు. పులివెందుల నుంచి తొండూరు మీదుగా ముద్దనూరుకు రాగానే నాలుగురోడ్ల కూడలిలో స్వాగతం పలికి గజమాలతో సన్మానం చేశారు. అనంతరం ఆయన ఎర్రగుంట్ల మీదుగా ప్రొద్దుటూరుకు వెళ్లారు.

ఎర్రగుంట్ల..: అల్లసానిపెద్దనమాత్యులకు సత్యకుమార్ నివాళులర్పించారు. ఆదివారం ఆయన సాయంత్రం ఆయన ఎర్రగుంట్ల మీదుగా ప్రొద్దుటూరుకు వెళ్లారు. ఈసందర్భంగా ఆయన ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలికి చేరుకోగానే ఎన్డీయే కూటమి నాయకులు పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు. నాలుగురోడ్ల కూడలి వద్దనున్న అల్లసాని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, స్థానిక నాయకులు కత్తిప్రతాప్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఆర్.నాగరాజు, జనసేన కో ఆర్డినేటర్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండోలో అనుమతులు ఇవ్వాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 29: ప్రైవేటు పాఠశాలల నిర్వహణకు అవసరమైన అన్ని అనుమతులను ఏకగవాక్ష విధానంలో ఇవ్వాలని ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లేటి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రవీంద్ర హైస్కూల్‌లో కడప, అన్నమయ్య జిల్లాల ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ కార్యనిర్వాహకుల సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల గుర్తింపును ఎనిమిదేళ్లకు బదులు పదేళ్లకు పెంచాలని, వాహనాల ఇన్సూరెన్స్ ప్రీమియంను తగ్గించాలని కోరారు. భవనానికి ఎన్‌ఓసీ, ఫైర్ అనుమతులు అన్నీ కలిపి ఒకేసారి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ట్రిపుల్ ఐటీ ఎంపికలో ప్రైవేటు పాఠశాల పట్ల చిన్నచూపు చూడడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో క్రుష్మా జిల్లా అధ్యక్షుడు బీఎస్ రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్బారెడ్డి, పట్టణాధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి రాజారాం, మదనపల్లె పట్టణాధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, చక్రపాణి, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పోస్ట్ మాస్టర్ ?

కాశినాయన సెప్టెంబరు29: నర్సాపురం పోస్టాఫీస్‌లో పలువురి ఖాతాదారు పొదుపు డబ్బును పక్కదారి పట్టించిన పోస్ట్‌మాస్టర్ నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు కాశినాయన ఎస్ఐ హనుమంతు తెలిపారు. పలువురు బాధితులు లిఖితపూర్వకమైన ఫిర్యాదు చేయడంతో వాటి ఆధారంగా సదరు ఉద్యోగిపై కేసునమోదు చేశామన్నారు. నర్సాపురం పోస్టాఫీస్‌లో చేతివాటం ప్రదర్శిస్తూ వచ్చిన సదరు పోస్ట్‌మాస్టర్‌ను పోలీసులు అదుపు లోకి తీసుకున్నట్లు సమాచారం.

రాష్ట్రస్థాయిక్రీడా పోటీలకు ఎంపికైన నాగపల్లవి

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 29: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు బ్రహ్మంగారి మఠం జిల్లా పరిషత్ గోవిందమాంబ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని కె.నాగపల్లవి ఎంపికైంది. అండర్ 14 విభాగంలో మేఘ డిఫెన్స్ అకాడమీలో నిర్వహించిన జిల్లా స్థాయి మాల్కంబ్ పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికైందని పాఠశాల హెడ్మాష్టర్ ఎస్.నిర్మలా దేవి, పీడీ పుష్పలత తెలిపారు.

పోల్‌వాల్ట్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక

బద్వేలు రూరల్, సెప్టెంబరు 29: స్థానిక ఫాతిమా ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థి త్రివిక్రమ్ పోల్‌వాల్ట్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ జ్యోతిష తెలిపారు. శనివారం కడప నగరంలో జిల్లా స్పోర్ట్స్ స్కూలులో నిర్వహించిన స్కూలుగేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి పోల్ వోల్ట్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి త్రివిక్రమ్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు.

జూదరుల అరెస్ట్

కాశినాయన, సెప్టెంబరు 29: మండలంలోని కేఎస్ కొట్టాల గ్రామంలో ఆదివారం ఐదుగురు పేకాట రాయుళ్ళను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. గ్రామంలోని ఓ కొట్టంలో పేకాట ఆడుతుండగా వారిని పట్టుకున్నారన్నారు.రూ.8500 స్వాధీనం చేసు కొని కేసు నమోదు చేశామన్నారు.



